శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త



# నేడు కోనలో మంత్రి ఆనంచే ఆధిలక్ష్మీ అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమి పూజ



**రాపూరు, నవంబరు 22 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ ఆధిలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్‌నిర్మాణానికి ఆదివారం వెంకటగిరి ఎమ్మెల్యే కురుగోండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో రాష్ట దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి భూమి పూజ నిర్వహించనున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. రూ. 6 కోట్ల 50 లక్షల రూపాయిలతో అమ్మవారి ఆలయాన్ని పునర్ నిర్మించనున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల 24 నిమిషాలకు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబరు 22, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం సాయంత్రానికి 12407 క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 74.952టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 200, ఎన్ఎఫ్‌సికి 500, పెన్నా డెల్టాకు 0, కండలేరు వరద కాలువకు 560 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 100.156 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ

- డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ - జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త** కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. శనివారం స్థానిక జిల్లా న్యాయ స్థానంలోని న్యాయమూర్తి వారి ఛాంబర్‌లో నిర్వహించిన ప్రభుత్వశాఖల సమన్వయ కమిటీ ఉన్నతస్థాయి సమావేశంలో లోక్ అదాలత్ కేసులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా వివరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలో 50వేల కేసులు పెండింగ్‌లో వున్నాయని, కేసులను వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు హైకోర్టు వారి ఆదేశాల మేరకు లోక్‌అదాలత్‌లను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. లోక్‌అదాలత్‌కు అర్హత గల కేసులను మాత్రమే అదాలత్‌లో పెట్టాలని పోలీసు అధికారులకు న్యాయమూర్తి సూచించారు. అన్ని ఇన్సురెన్సు కంపెనీలు కూడా రోడ్డు ప్రమాదాల కేసుల విషయంలో నష్టపరిహారాన్ని త్వరగా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. డిసెంబర్ 13న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను వినియోగించుకుని సత్వర న్యాయం పొందాలని ప్రజలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

### ఒక్క పోస్టుకార్డుపై సమస్యను తెలపండి... ఉచితంగా న్యాయసేవలు పొందండి

ప్రజలు సమాజంలో తమకు కలుగుతున్న ఇబ్బందులను ఒక్క పోస్టుకార్డుపై రాసి జిల్లా న్యాయసేవాధికార సంస్థకు పంపితే, ఆ సమస్యను విచారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా న్యాయసహాయం పొందాలని పిలుపునిచ్చారు. అనేక కేసుల్లో పౌరులకు నష్టపరిహారం, న్యాయ సేవలను న్యాయసేవాధికార సంస్థ ద్వారా అందించినట్లు ఆయన వివరించారు. సెంట్రల్ జైలులోని ఖైదీలకు కూడా బెయిలు మంజూరులో ఉచిత న్యాయసహాయం అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఉచిత న్యాయ సహాయం కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ప్రజాసమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్
- ప్రతి మూడు నెలలకొక సారి ప్రభుత్వ శాఖల సమన్వయ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం
- చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.115.27 కోట్లు మంజూరు
- నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు 7 సిగ్నల్ పాయింట్లు



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త:** సమాజం, న్యాయ వ్యవస్థతో మంచి అనుబంధం కలిగి ప్రభుత్వ శాఖలన్నీ ప్రజా సమస్యల పరిష్కారంలో కీలక భూమిక పోషించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక జిల్లా న్యాయస్థానంలోని న్యాయమూర్తి వారి ఛాంబర్‌లో ప్రభుత్వ శాఖల సమన్వయ కమిటీ ఉన్నతస్థాయి సమావేశం జిల్లా ప్రధాన న్యాయమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె. వాణి, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, నెల్లూరు, తిరుపతి ఎస్పీలు డాక్టర్ అజిత వేజండ్ల, సుబ్బరాయుడు, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ సౌజన్య, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, నిరుపేద ఖైదీలకు న్యాయసహాయం, లోక్ అదాలత్ కేసులు, బాధితులకు నష్టపరిహారం మొదలైన అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ మాట్లాడుతూ హైకోర్టు వారి ఆదేశాల మేరకు ప్రతి మూడునెలలకొకసారి ప్రజాసమస్యలకు పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వశాఖల సమన్వయ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. న్యాయస్థానాల దృష్టికి ప్రజలు తీసుకొచ్చిన పలు సమస్యలపై శాఖల వారీగా అధికారులతో చర్చించి పరిష్కరించేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి సమస్యను కూడా హైకోర్టు నిశితంగా పరిశీలిస్తుందని, కొన్ని సందర్భాల్లో హైకోర్టు వారే సమస్యను సుమోటోగా స్వీకరించి విచారిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో పత్రికల్లో వచ్చిన కొన్ని సంఘటలను హైకోర్టు సుమోటోగా స్వీకరించి చర్యలు ఆదేశించినట్లు ఆయన వివరించారు. అన్ని పోలీస్ స్టేషన్లలో చార్జి షీట్లను సకాలంలో ఫైల్ చేయాలని, లేకుంటే నోటీసులు జారీ చేస్తామని ఆయన చెప్పారు. అధికారులందరూ పౌరులకు మంచి చేయాలనే దృక్పథంతో పనిచేయాలని సూచించారు.

### చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద పై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.115.27 కోట్లు మంజూరు

తరచుగా ప్రమాదాలు జరుగుతున్న నెల్లూరు జాతీయరహదారి చింతారెడ్డి పాలెం జంక్షన్ అంశంపై కమిటీ సమావేశంలో చర్చించారు. ఈ సమస్యపై పలు పిటిషన్లు వచ్చిన విషయాన్ని ఎన్‌హెచ్ పీడీ ఎంకె చౌదరిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వివరణకోరగా, ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం 115.27 కోట్లు మంజూరు చేసిందని, త్వరలోనే టెండర్లు పూర్తిచేసి ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు అధికారి చెప్పారు. అలాగే ప్రమాదాల నివారణకు హైవేపై బ్లింకర్లు, సోలార్ లైట్లు ఏర్పాటు ప్రక్రియ డిసెంబరు 25లోగా పూర్తి చేస్తామని ఆయన చెప్పారు.

### నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు 7 సిగ్నల్ పాయింట్లను ప్రారంభిస్తున్నాం

నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు, ప్రమాదాల జరగకుండా 7 ప్రధాన రద్దీ కూడళ్లలో 7 ట్రాఫిక్ సిగల్స్ పాయింట్లను ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ నందన్ తెలిపారు. కెవిఆర్ పెట్రోలుబంకు, ఎస్పీ కార్యాలయం,హరనాథపురం, కనకమహల్, ఆర్టీసీ బస్టాండు మొదలైన రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగల్స్ ఏర్పాటు ప్రక్రియ పూర్తి అయ్యిందని, త్వరలోనే ప్రారంభిస్తామని కమిషనర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తికి వివరించారు. అలాగే రోడ్డుపై సంచరిస్తున్న పశువులను గోశాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ పోలీసులను జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశించారు. ఈ సమావేశంలో నెల్లూరు, తిరుపతి జిల్లాలకు చెందిన వివిధశాఖల అధికారులు, న్యాయశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పేదవాడికి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- నెల్లూరు కార్పొరేషన్, నుడా అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష.
- పలు అంశాలపై కీలక ఆదేశాలు జారీచేసిన మంత్రి
- సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా సుపరిపాలన అందిస్తున్న సీఎం చంద్రబాబు.
- మార్చి లోపు నిరుపేదలకు టిడ్కో ఇల్లు పంపిణి.
- నెల్లూరును ముప్పు నుంచి తప్పించాలంటే కాలువలపై ఆక్రమణదారులు సహకరించాలని ఆదేశం.
- కార్పొరేషన్, నుడా ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించిన మంత్రి నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్, నవంబర్ 22, ప్రభాతవార్త :** ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ముందుకెళ్తుందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో మంత్రి పలు అంశాలపై కార్పొరేషన్, నుడా అధికారులతో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. ప్రధానంగా ఎల్ ఆర్ ఎస్, బీఆర్ ఎస్ దరఖాస్తులపై మంత్రి ఆరా తీశారు. లే ఔట్ల అప్రూవల్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జనవరి నుంచి నుడా ఆదాయ, వ్యయాలను మంత్రికి నుడా వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు క్షుణ్ణంగా వివరించారు. కావలి కందుకూరుల్లో ఎంఐజీ లే ఔట్ల ద్వారా వచ్చిన ఆదాయంపై చర్చించారు.

### రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణ మాట్లాడుతూ

నుడా, కార్పొరేషన్ పరిధిలోని సమస్యలపై ప్రధానంగా సమీక్షించామన్నారు. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన టిడ్కో ఇళ్ల పనులు తిరిగి ప్రారంభిస్తామని తెలిపారు. 163 చోట్ల టిడ్కో పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. జూన్ కల్లా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో 43 వేల టిడ్కో ఇళ్లను మార్చి లోపు సిద్ధం చేస్తామన్నారు. అర్హత ఉన్న వాళ్ళు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. అమృత్, యూ ఐ డీ ఎఫ్ కింద రాష్ట్రంలో 13 వేల కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభం కాబోతున్నాయన్నారు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో రూ.800 కోట్లతో పనులు జరగనున్నాయని స్పష్టం చేశారు. నెల్లూరును ముంపునుంచి తప్పించాలంటే కాలువల పై ఆక్రమణలు తొలగించాలని ఆదేశించారు. ఆక్రమణదారులు సహకరించాలని కోరారు. పేదలు ఇళ్ళు కోల్పోతే ప్రత్యామ్నాయం చూపుతామని మాటిచ్చారు. గత ప్రభుత్వం వదిలివెళ్లిన 85 లక్షల టన్నుల చెత్తను తొలగించామన్నారు. డంపింగ్ యార్డులు లేని ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా సీఎం చంద్రబాబు నాయుడు సుపరి పాలన అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని పెట్టి వెళ్లిందని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు అపార అనుభవంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్నారని తెలియజేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని 100 శాతం నెరువేరుస్తామన్నారు. అనంతరం

### నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ

ఎల్ ఆర్ ఎస్ ,బీపీఎస్ ద్వారా మధ్యతరగతి వారికి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందన్నారు. దిన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలనీ.. నిరక్ష్యం వహిస్తే నష్టం తప్పదన్నారు.ఎల్ ఆర్ ఎస్ అమలులో మంత్రి ఆదేశాలను తూచా తప్పక అమలు చేస్తామన్నారు.

### ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావు మాట్లాడుతూ

గత ప్రభుత్వం కందుకూరు మున్సిపాలిటీ అభివృద్ధిని గాలికొదిలేసిందనీ అవేదన వ్యక్తం చేశారు. మంత్రి నారాయణ సహకారంతో సర్వతో ముఖాభివృద్ధికి బాటలు వేస్తున్నామనీ వెల్లడించారు. ఎంఐజీ లే అవుట్ లు,ఎల్ ఆర్ ఎస్ ,బిపిఎస్ ద్వారా ఆదాయాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామ నీ స్పష్టం చేశారు. అనంతరం

### కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి మాట్లాడాతు

మంత్రి నారాయణ సూచనలతో ముం దుకువెళుతు న్నామన్నారు. ప్రజా ప్రభు త్వం లోఅంతా మంచే జరుగుతుందనీ తెలిపారు.

### టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ

అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు కూటమి ప్రభుత్వం మంచి అవకాశం ఇచ్చిందన్నారు. నెల్లూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలనీ పిలుపునిచ్చారు. నగర అభివృద్ధికి ప్రజలు సహకరించాలనీ విజ్ఞప్తి చేశారు.మంత్రి నారాయణ సహకారంతో రూరల్ లో రైల్వే అండర్ బ్రిడ్జిలు సాధిస్తామన్నారు.ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా పార్కులు ఏర్పాటు చేస్తున్నామనీ ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. మంత్రి చొరవతో గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి కార్పొరేషన్ లో జరుగుతోందన్నారు. జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, కావ్య క్రిష్ణారెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, కావలి ,కందుకూరు మున్సిపల్

# నూతన భవనాల అనుమతులను తనిఖీ కమిషనర్



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 22,ప్రభాతవార్త :** నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వివిధ భవనాలకు సంబంధించి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ, నూతన భవనానికి కొలతలు వేసి కమిషనర్ పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణ లో భాగంగా శనివారం స్థానిక 28వ డివిజన్ పోస్టల్ కాలనీ, పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో వివిధ భవనాలకు సంబంధించి అసెస్మెంట్ డిమాండ్లను తనిఖీ చేసి భవనానికి కొలతలు వేసి పరిశీలించారు. స్థానికంగా జరుగుతున్న నూతన భవనాల అనుమతులను తనిఖీ చేశారు. భవనాలకు సంబంధించిన ఖాళీ స్థలం పన్నుల చెల్లింపులను పరిశీలించారు. డివిజన్ పరిధిలో అన్ని డ్రైన్ కాలువలలో క్రమం తప్పకుండా పూడికతీత పనులు చేపట్టేలా పర్యవేక్షించాలని వార్డు సచివాలయ శానిటేషన్ కార్యదర్శులను ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే అందించేలా నిరంతరం పర్యవేక్షించాలని, తడి పొడి వ్యర్థాలను విడిగా సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నెల్లూరు నగరపాలక సంస్థ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్ విభాగం, శానిటేషన్ విభాగం అధికారులు, వార్డు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ 24న జిల్లాకు రాక

జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్ల



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త:** 20 అంశాల కార్యక్రమ అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ 24వ తేదీన జిల్లాకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్ను శుక్లా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 24న మధ్యాహ్నం 3.20 గంటలకు విజయవాడ నుండి వందే భారత్ రైలు (20678)లో బయలుదేరి సాయంత్రం 6.04 గంటలకు నెల్లూరు చేరుకుంటారు. అనంతరం స్థానిక గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకుంటారు. 25వ తేదీ ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న ఆరోగ్య, విద్య రంగాలకు సంబంధించిన ప్రత్యేక పథకాల అమలు, అమృత్ పథకం, జల్ జీవన్ మిషన్, ప్రధాన్ మంత్రి సూర్య ఘర్, పీఎం కుసుమ్ పథకాల పురోగతి తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 1.00 గంటకు మీడియా సమావేశంలో మాట్లాడుతారు. కార్యక్రమానంతరం మధ్యాహ్నం 3.00 గంటలకు నెల్లూరు నుండి చెన్నైకి కారులో బయలుదేరి రాత్రి 7.00 గంటలకు చెన్నై విమానాశ్రయానికి చేరుకుంటారని కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు.

# గ్రాడ్యుయేషన్ డేకి ఎమ్మెల్యేకి ఆహ్వానం



**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త :** కావలి పట్టణం పాత ఊరులోని శ్రీ లక్ష్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఫిజియోథెరపీ కళాశాలలో డిసెంబర్ 3వ తేదీనన జరగనున్న ఫస్ట్ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథిగా విచ్చేయవలసిందిగా కళాశాల యాజమాన్యం, విద్యార్థులు శనివారం కావలి టిడిపి కార్యాలయానికి వెళ్లి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నందున కళాశాల ప్రతినిధులు ఎమ్మెల్యే దగుమాటికి ఆహ్వాన పత్రాన్ని అందజేసి, విద్యార్థుల తొలి పట్టాభిషేక వేడుకల్లో పాల్గొనవలసిందిగా కోరడం జరిగింది.

# జల్ సంచయ్- జన్ భాగీదారీ(జేఎస్‌జేబీ) అవార్డు అందుకున్న డ్వామా పీడీ



**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త-వైద్యం** జల్ సంచయ్-జన్ భాగీదారీ(జేఎస్‌జేబీ) అవార్డు అందుకున్న డ్వామా పీడీ గంగాభవానిని నెల్లూరులోని వేదాయపాలెం కార్యాలయంలో సత్కరించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి. వర్షపు నీటిని వడిసిపట్టి భూగర్భ జలాలను పెంచడంతో పాటు జలసంరక్షణకు విశేష కృషి చేసినందుకు గాను నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ చేతుల మీదుగా కలెక్టర్ హిమాన్ను శుక్లాతో కలిసి అవార్డు అందుకున్న గంగాభవాని.

# కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో ప్రచ్ఛన్న యుద్ధం

- సూపర్‌వైజర్ - సీడీపీవో - ఇదీ సంగతి



**కోవూరు, నవంబం22 ప్రభాతవార్త :** పూర్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యాబుద్ధులు అందించాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సూపర్‌వైజర్, సీడీపీవోల మధ్య జరుగుతున్న ప్రత్యమ్న యుద్ధం కారణంగా ఆశించిన మేర చిన్నారులకు సేవలు అందలేకున్నాయి. ఫలితంగా ప్రభుత్వం ఏ ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసిందో ఆ ఉద్దేశాలు నెరవేరని పరిస్థితి ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో కాదు నియోజకర్గానికి మండల కేంద్రం అయిన కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టులో నెలకొంది. వాస్తవంగా ఈ ప్రాజెక్టు పరిధిలో నాలుగు మండలాలు ఉన్నాయి. 360 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. 12 సెక్టార్‌లుగా 8 మంది సూపర్‌వైజర్లు ఈ ప్రాజెక్టులో పనిచేస్తున్నా వీరిలో ఒకరికొకరు సయోధ్య లేని కారణంగా పలు ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు లేక అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు సరైన టైమ్‌కు రాక వెలవెలబోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో ఈ ప్రాజెక్టులో ఐదేళ్ల పనిచేసిన సీడీపీవోలు ఆశించిన మేర కేంద్రాలను పర్యవేక్షించిన దాఖలాలు ఆశించిన మేర లేవు. ఫలితంగా గత ఐదేళ్లలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆశించిన మేర ప్రగతి కానరాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. చిన్నారులకు అవసరమైన బెంచీలు, ఆట పరికరాలు సురక్షిత నీరు అందించేందుకు వాటర్ ఫిల్టర్‌లు, తదితర వాటిని అందజేయడం జరిగింది.

### సూపర్‌వైజర్ల పనితీరుపై

కోవూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని నాలుగు మండలాలకు సంబంధించి 8 మందిపైగా సూపర్‌వైజర్లు ఉన్నారు. గతంలో పనిచేసిన సీడీపీవోలు వీటిపై ఆశించిన మేర దృష్టి పెట్టిన దాఖలాలు లేకపోవడంతో ఎవరికి వారే యమునాతీరే లా ఈ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. ప్రస్తుతం కోవూరు ఎమ్మెల్యే సూచనల మేరకు సీడీపీవోగా కావలి ఏసీడీపీవోగా పనిచేస్తున్న అధికారిని ఇక్కడికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ అధికారిణి ముక్కుసూటిగా పోవడంతో పలు సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. ఇటీవల సూపర్‌వైజ.ర్లకు పీడీ ఆదేశాల మేరకు మెమోలు ఇవ్వగా సూపర్‌వైజర్లు తమ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సూపర్‌వైజర్లు మెమో రూపంలో సర్క్యులర్ అందజేశారు. ఈ విషయం రావణ కాష్టంగా మారింది. సూపర్‌వైజర్లను వారికి కేటాయించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించమని చెబుతుంటే ఆశించిన మేర చేపట్టిన దాఖలాలు లేవు. కొత్తగా వచ్చిన ఈ అధికారిణి సూపర్‌వైజర్లను పరుషజాలంతో మాట్లాడడంతో ఇటీవల వారంతా తీవ్రస్థాయిలో మనస్థాపానికి గురై పీడీ , కోవూరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా వచ్చిన ఈ అధికారిణి తమను తీవ్రస్థాయిలో వేదిస్తుందని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సూపర్‌వైజర్లు, సీడీపీవోల మధ్య ప్రత్యమ్న యుద్దానికి తెర తీసింది. తాము విధులు నిర్వహిస్తున్నా తమ వ్యక్తిగత విషయాలపై మాట్లాడడంసీడీపీవో మంచిది కాదని పీడీ దృష్టికి తీసుకువచ్చారు. శనివారం జరిగిన సమావేశంలో సూపర్‌వైజర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు నూతనంగా వచ్చిన సీడీపీవోపై ఫిర్యాదు కూడా చేశారు. దీంతో సూపర్‌వైజర్ సీడీపీవోల మధ్య ప్రత్యమ్న యుద్ధ మొదలైంది. ప్రస్తుతం ఈ పరిస్థితి ఏ దిశకు దారి తీస్తుందోనని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు పీడీ హేనాసుజన్‌ను వివరణ కోరగా.. ఎవరికి కేటాయించిన విధులు వారు బాధ్యతగా నిర్వహించాలి తప్ప ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడం మంచి పద్ధతి కాదన్నారు. తీరు మార్చుకోకపోతే ఈ ప్రాజెక్టు పరిస్థితి ఏమిటని ఆమె చెప్పడం కొసమెరుపు.

## పారదర్శకంగా విధులు నిర్వహించాలి



**కోవూరు, నవంబం22 ప్రభాత వార్త :** ప్రతి బూత్ లెవల్ అధి కారి వారికి కేటాయించిన విధులు బాధ్యతలను సక్రమంగా నిర్వహి ంచి ప్రస్తుతం చేపట్టనున్న ఎస్ఐ ఆర్ కార్యక్రమాన్ని పూర్తిస్థా యిలో విజయవంతం చేయాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీ ల్దార్ కార్యాలయంలో సర్ ప్రక్రియపై ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ ప్రస్తుతం జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి బీఎల్‌వోలు నవంబర్ 4 నుంచి డిసెంబర్ 4 వరకు ఇంటింటికీ వెళ్లి సర్వే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి బీఎల్‌వో వారి వారి పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రతి ఇంటికి వెళ్లి ఎన్యుమరేషన్ ఫామ్‌లను అందజేస్తారన్నారు. ఓటరు జాబితాలోని ప్రతి ఒక్కరూ ఈ ఫారంను నింపి వారికి అందజేయాలన్నారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 4వ తేదిలోగా పూర్తి అయ్యేలా ప్రతి బీఎల్‌వో తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ ఫారంలో అదే చిరునామాలో ఉంటున్నారా.. వేరే ప్రాంతానికి తరలివెళ్లారా.. చనిపోయారా అనే విషయలను కూడా నిశిత పరిశీలన చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ ప్రక్రియను పారదర్శకంగా ఎలక్షన్ కమిషన్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ సతీష్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్, బీఎల్‌వోలు ఉన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వహించాలి




**కోవూరు, నవంబం22 ప్రభాతవార్త :** అంగన్‌వాడీ కార్యకర్తలు తమకిచ్చిన విధులు , బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తే ఎటువంటి సమస్యలు ఉత్పన్నం కావని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ హేనాసుజన్ అన్నారు. కోవూరులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో శనివారం దత్తత మాసోత్సవాల సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యాక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త వారి వారి పరిధిలో యువతి గర్భం దాల్చిన నుంచి కాన్పు అయ్యే వరకు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. కాన్పు అయిన తర్వాత ఎక్కడ ఉంది.. సక్రమంగా పుట్టిన బిడ్డకు ఫీడ్ ఇస్తుందా అనే వివరాలను కూడా సేకరించాలన్నారు. ప్రస్తుతం కోవూరు ప్రాంతంలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, దీనిని అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే 1098 కానీ, సంబంధించిన సూపర్‌వైజర్, సీపీడీవోలకు సమాచారం ఇవ్వాలన్నారు. ఒకవేళ బాల్య వివాహం జరిగితే ఆ ప్రాంతంలో అంగన్‌వాడీ కార్యకర్త సక్రమంగా విధులు నిర్వహించడం లేదని తెలుస్తుందన్నారు. ఇటీవల కాలంలో ఆడబిడ్డలను పుట్టిన తర్వాత బస్టాండ్‌లో వదిలివేయడం. చెత్తకుప్పల్లో వేయడం జరుగుతుందన్నారు. ఎవరికైనా బిడ్డను పెంచడం కష్టంగా ఉంటే వారి దగ్గర దత్తత తీసుకుని ప్రాంగణంకు తరలించాలన్నారు. బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ ఈ దత్తత మాసోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు వారి వారి పరిధిలో అవగాహన కల్పించేలా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం సీడీపీవో శారద అంగన్‌వాడీ కార్యకర్తలు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల సూపర్‌వైజర్లు ఉన్నారు.

## పాఠశాలను సందర్శించిన ఎంఈఓ గోవిందయ్య



**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** పాఠశాలల తనిఖీలలో భాగంగా శనివారం కావలి రామ్మూర్తి పేట నందుగల పురపాలక సంఘ ప్రాథమిక పాఠశాలను కావలి మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య పరిశీలి ంచడం జరిగింది. అనంతరం పాఠశాల పరిసరాల్లో శుభ్రతను అక్కడ పెంచుతున్నటువంటి మొక్కలను చూసి పాఠశాల సిబ్బందిని అభినందించడం జరిగింది. అనంతరం పాఠశాల రికార్డులను,హ్యాండ్ బుక్ లను,డైరీలను చెక్ చేసి ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సీతన్నకు తుది వీడ్కోలు పలికిన కాకాణి, ప్రసన్నకుమార్‌రెడ్డి



**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త :** వైసిపి సీనియర్ నాయకులు మేనకూరు సీతారామిరెడ్డికి వైసిపి జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్దన్‌రెడ్డి,మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తుది వీడ్కోలు పలికారు. నాయకులు,కార్యకర్తలతో కలిసి అంతిమ యాత్రలో పాల్గొన్నారు. సీతన్న మృతి తీరని లోటు అని వారు వ్యాఖానించారు.ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు,కార్యకర్తలు, సీతన్న అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## జాబ్ మేళా ను సద్వినియోగపరచుకోగలరు

**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ(ఎన్. హెచ్.డి.ఎస్)వారు మెప్మా వారి అనుసంధానం తో డిసెంబరు 1వ తేదీన జాబ్ మేళను నిర్వహించనున్నట్లు కావలి మున్సిపల్ కమిషనర్ జి.శ్రావణ్ కుమార్ మెప్మా తరపున శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మెప్మా నిపుణ వారి జాబ్ మేళా నందు 10వ తరగతి,ఇంటర్, ఐటిఐ, డిప్లొమా,బీటెక్,ఎంటెక్,ఆల్ గ్రాడ్యుయేట్స్,పీజీ మరియు ఫార్మసీ చదివిన వారు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు అర్హులని తెలియజేశారు.రిజిస్ట్రేషన్ కొరకు జాబ్ మేళా మెప్మా కం సైట్ నందు నమోదు చేసుకోవాలని తెలియజేశారు.ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవలసినది గా కోరడం జరిగింది.

## విజయవంతంగా ఫార్మసీ వారోత్సవాలు



**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** కావలి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కాలేజ్ ఆఫ్ ఫార్మాసూటికల్ సైన్స్ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుండి 22వ తేదీ వరకు 64వ ఫార్మసీ వారోత్సవాలు విజయవంతంగా నిర్వహించడం జరిగింది.ఈ వారోత్సవాల ముగింపు కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ వారోత్సవాలలో జబ్బు పడిన వ్యక్తి అజాగ్రత్తతో తీసుకునే మందులపై అప్రమత్తత,జాగ్రత్తలు, సలహాలు,పర్యావరణాన్ని పరిరక్షించుటకు మొక్కలు నాటే కార్యక్రమం,సాంస్కృతిక కార్యక్రమాలు,మానసిక ఉల్లాసానికి క్రీడా పోటీలు,ఇండక్షన్ ప్రోగ్రాం మొదలగునవి విద్యార్థులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది.ఈ వారం రోజుల కార్యక్రమాలలో ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ విజయభాస్కర రావు,విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు,రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత,కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నిత్యానంద్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని ఈ వారోత్సవాలను జయప్రదం చేయడం జరిగింది.

## ఘనంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు



**కొడవలూరు, నవంవర్ 22 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఉన్న శ్రీ కామాక్షితాయి నాగేశ్వర స్వామి ఆలయంలో కొడవలూరు పంచాయతీ యువ నాయకులు ఆధ్వర్యంలో కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు వేమిరెడ్డి దంపతుల పేరిట అర్చకులుచే అర్చనలు వివిధ రకాల పూజలు చేశారు. ఈ సందర్భంగా వెంకీ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రజాసేవకే అంకితమైన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు వైభవంగా జరుపుకోవడం జరిగిందన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లపల్లి బి2 నీటి సంఘ డైరెక్టర్ నక్క రమణయ్య, అంబటి విజయ్ కుమార్, ఒట్టూరు శ్రీనివాస్ యాదవ్, జి.సంతోష్, రాకేష్, సుధీర్, అయ్యప్ప భక్తులకు తదితరులు పాల్గొన్నారు.

## నార్త్ రాజుపాలెం లో రక్తదాన శిబిరం



**కొడవలూరు,నవంబర్ 22 ప్రభాతవార్త:** మండలంలోని నార్త్ రాజుపాలెం పిఎస్ఆర్ కళ్యాణ మండపంలో కోవూరు శాసన సభ్యు రాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుక సందర్భంగా మండల టిడిపి నాయ కుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహిం చారు. ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ రక్తదాన శిబిరాన్ని స్థానిక తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీవో వెంకట సుబ్బారావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ ముంగమూరు శ్రీహరి రెడ్డి, అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు,నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్.ఎస్.ఎస్.క్యాంప్ నందు ఆరోగ్య అవగాహన సదస్సు

**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** జవహర్ భారతి డిగ్రీ కళాశాలకు చెందిన రెండు ఎన్.ఎస్.ఎస్.యూనిట్ల ఆధ్వర్యంలో జరుగుతున్న స్పెషల్ క్యాంపులో భాగంగా నాల్గవ రోజు శనివారం కావలి శివారులోని పెంకుల ఫ్యాక్టరీ గిరిజన కాలనీలో, కావలి చెరువు ఎస్టీ కాలనీ లో ఆరోగ్య అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీజనల్ గా సోకే వ్యాధులపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆరోగ్య కార్యకర్తలు రత్నకుమారి,కోమలి దేవి,ఆశ వర్కర్లు ఎస్.కె మొహిన్, వెంకటలక్ష్మి వర్షాకాలంలో, చలికాలంలో,ఎండాకాలంలో తీసుకోవలసిన ఆరోగ్యపర జాగ్రత్తలు,అప్రమత్తతలు గురించి కాలనీవాసులకు, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లకు అవగాహన కల్పించడం జరిగింది.అలాగే జవహర్ భారతి డిగ్రీ కళాశాల వ్యాయామ అధ్యాపకులు డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి గ్రామస్తులకు యోగా గురించి, శారీరక పటుత్వం గురించి తెలియ పరిచారు.జవహర్ భారతి డిగ్రీ కళాశాల జంతు శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ జి.రమణారెడ్డి దోమలు, ఈగలు వల్ల కలిగే అనారోగ్య సమస్యల గురించి,వాటికి తగు సలహాలు,జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమం కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ లు పి. నాగేశ్వరరావు, ఎస్.కె. అయూబ్ అహ్మద్ నిర్వహణలో జరిగింది.ఈ కార్యక్రమంలో జవహర్ భారతి విశ్రాంత కామర్స్ అధ్యాపకులు మన్నేపల్లి వెంకటేశ్వర్లు, కామర్స్ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. సుబ్బరా యుడు, కాలనీవాసులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లుపాల్గొన్నారు .

## మందాడి చెరువులో పడి వ్యక్తి మృతి

**కావలి, నవంబర్22, ప్రభాతవార్త:** కావలి, ముసునూరు కు చెందిన గుడ్దేటి రమేష్ (37) ముసునూరు మందాడి చెరువులో పడి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది.కావలి రూరల్ పోలీసుల సమాచారం మేరకు కావలి,ముసునూరు లోని మందాడి చెరువు నీటిలో పడి ముసునూరుకు చెందిన గుడ్దేటి రమేష్ మృతి చెందడం జరిగిందని తెలియజేశారు.ఈ వ్యక్తి బాగా ఉబ్బిపోయి ఉన్నాడని తెలియజేశారు.ముసునూరు వీఆర్వో పి.శ్రీనివాసులు కావలి రూరల్ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగిందని తెలియజేశారు.మృతుడు మతిస్థిమితం లేక గత కొద్ది కాలంగా బాధపడుతూ రెండు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లిపోయాడని మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కావలి రూరల్ ఎస్సై బాజిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోనుపల్లిలో మృతురాలి కుటుంబానికి రాజా రెడ్డి ఆర్థిక చేయూత



**గోనుపల్లి(రాపూరు),నవంబరు22ప్రభాతవార్త :** మండలంలోని గోనుపల్లి పంచాయితీలోని రామకూరు దళిత వాడలో శనివారం మృతి చెందిన చేజర్ల రాధయ్య భార్య అంత్యక్రియలకు గోనుపల్లి గ్రామ టిడిపి ఆధ్యక్షుడు ఈగా రాజా రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. రామకూరు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకుడు నాగా గోవర్ధన్ రెడ్డితో కలసి మృతురాలి నివాసానికి వెళ్లిన రాజా రెడ్డి అమె అంత్యక్రియల నిమిత్తం రూ. 5వేల ఆర్థిక సాయాన్ని తన సొంత నిధుల నుండి అందించారు. పంచాయితీలో పేదలు మృతి చెందితే వారి కుటుంబానికి ఆర్థిక సాయం తన సొంత నిధుల నుండి ఆందజేస్తూ రాజా రెడ్డి వారికి అండగా వుంటున్నారు.

## చెన్ను సోదరులను కలసిన వెలుగు సిబ్బంది



**రాపూరు,నవంబరు22ప్రభాతవార్త :** రాపూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షలు చెన్ను అశోక్ రెడ్డిలను శనివారం వెలుగు ఎపియం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది మర్యాదపూర్వకంగా కలి సారు. ఈ సందర్భంగా వారు చెన్ను సోదరు లకు శాలువా కప్పి సత్కారించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు శ్రీనివాసులు, శారద, సంజీవయ్య, పెంచలయ్య రమణమ్మ తదితరులున్నారు.

## రైతుల అవసరం మేరకు సకాలం నీరు అందిస్తాం



**కలువాయి నవంబర్ 22 ప్రభాతవార్త :** రైతుల అవసరం మేరకు సకాలంలో సాగునీరు ,త్రాగునీరు అందిస్తామని సోమశిల ప్రాజక్టు చైర్మన్ వేలూరు కేశవచౌదరి తెలిపారు. శని వారం కలువాయి చెరువు నుండి దక్షణ కాలువకు రైతుల నారు మడులకు 3 వందల క్యూసిక్కులు నీటిని 50 వేల ఎకరాలకు కేశవ చౌదరి,ఇఇ మహేశ్వరయ్య తో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతు నీటిని మూడు దఫాలుగా అవసరం మేరకు రైతులకు పంటల సాగుకోసం విడుదల చేస్తామని అన్నారు.ఈనెల 15 వ తేది విడుదల చేయాల్సి వుండగా తుఫాన్ ప్రభావం కాలువల మరమ్మత్తులు నిర్వహించడం వల్ల జాప్యం జరిగిందని అన్నారు.మొదట,విడత రెండో విడత పంటలకు చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తామని, అదేవిధంగా సోమశిల ప్రాజక్టు నందు 75 టిఎంసిల నీరు నిలువ వుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతులను దృష్టిలో వుంచుకొని యూరియా,విత్తనాలు కొరత లేకుండా రైతు పక్షపాతిగా ప్రభుత్వం వ్యవహారిస్తుందని అన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి సారువ ప్రాంతంలో అదే విధంగా మాగాణి కాలువల నందు పూడికను తొలగించేందుకు స్పందించిన ప్రజాప్రతినిధులకు,అధికారులకు టిడిపి మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో కలువాయి చెరువు ఆయకట్టు చైర్మన్ చల్లా విజయ్‌బాస్కర్‌రెడ్డి,రాపూరు ఏఎంసి వైస్ చైర్మన్ గడ్డం కిషోర్‌రెడ్డి,డిఇలుచాన్‌బాషా,మస్తానయ్య, సుధీర్‌కుమార్ ,ఏఇలు నారాయణరాజు, ఖలీల్,వెంకటేశ్వర్లు,జనసేన పార్టీ మండల కన్వీనర్ పరంకొండ మనుహర్ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు



**కొడవలూరు, నవంబర్ 22 ప్రభాతవార్త:** మండలం నార్త్ రాజుపాలెం పి ఎస్ ఆర్ కళ్యాణ మండపంలో తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పుట్టినరోజు వేడుకలు మండల ఇన్చార్జి ముంగమూరు శ్రీహరి రెడ్డి ఆధ్వర్యంలో మండల నాయకులు ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు నాప వెంకటేశ్వర్ల నాయుడు మాట్లాడుతూ ప్రజల పట్ల ఎల్లవేళల దృష్టిసారించి ప్రజా సేవకురాలు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషకరం,ఇంకా మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు కోలాహలంగా జరుపుకుని కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా నాణ్యత పై ప్రత్యేక శిక్షణ తహశీల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, నవంబర్ 22 ప్రభాతవార్త:** మండల కేంద్రం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బిఎల్ఓ సూపర్వైజర్లు, వీఆర్వోలకు తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఉన్న తప్పులను సరిదిద్దడం, కొత్త ఓటర్లను చేర్చడం, చనిపోయిన వారిని లేక అర్హత లేని వారిని తొలగించాలని తెలియజేశారు. ఖచ్చితమైన ఓటర్లను జాబితాలో పొందుపరచడం ముఖ్య లక్ష్యమన్నారు.అలాగే పలు అంశాలపై వివరించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సారంగపాణి,ఏ ఎస్ ఓ గాయత్రి, రెవెన్యూ ఇన్స్పెక్టర్, వీఆర్వోలు, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

## కలువాయిలో సర్వసభ్య సమావేశం




**కలువాయ నవంబర్ 22 ప్రభాతవార్త :** మండల ప్రజాపరిషత్ కార్యాలయం నందు ఎంపిపి ఆర్ లక్ష్మీదేవి అధ్యక్షతన శనివారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది.ఈ సమావేశంలో అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిదులు పాల్గొని మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను సమావేశం దృష్టికి తీసుకొని వచ్చారు.మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రజా ప్రతినిదులు అధికారులు సహకారం అందించి త్వరితగతిన పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా జడ్‌పిటిసి బులగాకుల అనీల్‌కుమార్‌రెడ్డి అన్నారు.అనంతరం బాల్య వివాహాలు అరికట్టేందుకు అధికారులు ఈ సందర్భంగా అందిరి చేత అధికారులు ప్రతిజ్ఞ చేయించారు.ఈకార్యక్రమంలో వైస్ ఎంపిపి దుంపా రమాదేవి, ఎంపిడిఒ శైలజా,అధికారులు,ప్రజా ప్రతినిదులు పాల్గొన్నారు.

## కొండ బిట్రగుంటలో ఉంజలసేవ



**బిట్రగుంట నవంబర్ 22 ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండబిట్రగుంట శ్రీప్రసన్నవేంకటేశ్వరస్వామి దేవస్థానం లో శనివారం శ్రీస్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజలలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలతోపాటు దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం శ్రీస్వామి వారికి, అమ్మవారికి సహస్ర దీపాలంకరణ, ఉంజాలో సేవ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## పట్టణ ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో ఆక్రమణలను తొలగింపు



**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 22,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు స్థానిక కొత్తూరు హెచ్. ఆర్ కళ్యాణమండపం నుంచి తెలుగు గంగ కాలువ కార్యాలయం వరకు ఉన్న రోడ్డు ఆక్రమ ణలను తొలగించే కార్యక్రమాన్ని పట్టణ ప్రణాళిక విభాగం అధికారుల నేతృత్వంలో సిబ్బంది శనివారం చేపట్టారు. కమిషనర్ ఆధ్వర్యంలో గతంలో నిర్దేశించిన మార్కింగ్ వరకు జెసిబి వాహనాల సహాయంతో రోడ్డు ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించి వేశారు.

## మున్సిపల్ కార్మికుల ఆందోళనకు భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ నాయకుల మద్దతు.




**నెల్లూరు కార్పొరేషన్,నవంబర్ 22,ప్రభాతవార్త:** మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని, చనిపోయిన కార్మికులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని నెల్లూరు నగరపాలక సంస్థ వద్ద కొనసాగుతున్న ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆందోళన 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా భవననిర్మాణ కార్మిక సంఘం రూరల్ కార్యదర్శి ఎస్కే ఖలీల్, ఏ. ఆర్. టి. డబ్ల్యూ ఎఫ్ సభ్యులు మద్దతు ప్రకటించారు. అనంతరం అసంఘం నాయకులు సురేష్, నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గత 19 రోజుల నుండి ఆందోళన చేస్తున్న అధికారులు పట్టించుకోకపోవడం దారుణం. అధికారులు స్పందించి వెంటనే మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వారి పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నామని, భవిష్యత్తులో జరిగేటువంటి ఆందోళనకు పూర్తి మద్దతు తెలియజేస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, మున్సిపల్ కార్మికులతో చర్చలు జరిపి వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే. పెంచల నరసయ్య, కోటేశ్వరరావు, సుజాతమ్మ, వజ్రమ్మ, సునీల్, దేశ మూర్తి చెన్నయ్య, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



**కలువాయి నవంబర్ 22 ప్రభాతవార్త :** విద్యార్దులు బాల్యం నుండే విద్యను అభ్యసించడం వలన సమాజంలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలుగు దేశం పార్టీ మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి అన్నారు. కలు వాయి గ్రామ మాజీ సర్పంచ్ చల్లా ఇందిరా జన్మదిన పురస్కరించుకొని చల్లా రఘురామిరెడ్డి యువత ఆధ్వర్యంలో రాజుపాళెం ఎంపిపిఎస్, జిపి పాఠశాల నందు 50 మందికి పైగా విద్యార్దులకు ప్లేట్లు,వాటర్ బాటిల్స్ ,తినుబండారులు,నోటి బుక్స్ తదితర విద్యాసామాగ్రిని రఘురామిరెడ్డి చేతులు మీదుగా అందజేశారు.ప్రతి ఏడాది చల్లా ఇందిరా జన్మదినం సందర్భంగా మండలంలోని పలు ప్రాంతాలలో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఈక్రమంవో వేడుకలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్దుల నుద్దేశించి రఘురామిరెడ్డి మాట్లాడుతు ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్ రాజ్యలక్ష్మీ,ఉపాధ్యాయులు ఎం.వేషగిరి ఎస్ఎంసి చైర్మన్ కె సుబ్రమణ్యం, విద్యార్దులు తల్లిదండ్రులు పాల్గొన్నారు మండలాభివృద్ధికి నిరతరం కృషి చేస్తా టిడిపి మండలాధ్యక్షునిగా నియమించినందుకు సహకారం అందించిన వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో మండల అభివృద్ధికి పార్టీ శ్రేణులతో కలిసి నిరంతరం కృషి చేస్తానని పార్టీ మండల కన్వీనర్ చల్లా రఘురెడ్డిపేర్కున్నారు. మాజీ సర్పంచ్ ఇందిరా జన్మదిన వేడుకలలో పాల్గొన్నా రఘురామిరెడ్డి రాజుపాళెంలోని గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడారు,ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి తనవంత సహాకం అందిస్తానని రాజుపాళెం మెయిన్ రోడ్డు నందు ఎస్‌సి కాలనీ వరకు 30 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తానని ఆయన అన్నారు. గ్రామంలోని మహిళలు ఈ సందర్భంగా ఆయన దృష్టికి తీసుకొని వెళ్లారు.

## శ్రీ మల్లేశ్వర స్వామి హుండీ లెక్కింపు



**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** కావలి పాత ఊరులోని శ్రీ మల్లేశ్వర స్వామి(కావలి శివాలయం) వారి దేవస్థానమునందు ఈనెల 24వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఈవో అరవ రాధాకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు.హుండీ లెక్కింపు లెక్కింపు కార్యక్రమాన్ని భక్తులకు కావలి పట్టణ మరియు పరిసర ప్రాంత ప్రజలకు తెలియ జేయడమైనదని తెలియజేశారు.

## ఘనంగా ప్రశాంతమ్మ జన్మదిన వేడుకలు



**కోవూరు, నవంబం22 ప్రభాత వార్త :** కోవూరు ఎమ్మెల్యే శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారి జన్మదిన వేడుకలు నెల్లూరులోని విపిఆర్ నివాసం వద్ద ఘనంగా జరిగాయి. కోవూరు జనసేన నాయకులు గుడి హరిరెడ్డి, డేవిడ్ జాన్ ఆధ్వర్యంలో తరలి వచ్చిన అభిమానుల మధ్య విపిఆర్ నివాసం వద్ద భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బాణసంచా చప్పుళ్ళు, తీన్మార్ మోతల మధ్య జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిల్లా అభివృద్ధి ప్రదాత శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి గారి సతీమణిగా కోవూరు ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రశాంతమ్మ పని చేస్తున్నారని చెప్పారు. వేమిరెడ్డి దంపతుల చల్లని ఆశీసుల మధ్య జిల్లా, కోవూరు ప్రజలు నిశ్చింతగా జీవిస్తున్నారని చెప్పారు. విపిఆర్ నేత్రా, విపిఆర్ అమృతధార, విపిఆర్ విద్య వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలకు సొంత నిధులు వెచ్చిస్తూ జిల్లా ప్రజల కోసం పనిచేస్తున్నారని చెప్పారు. ఇలాంటి దంపతులు నెల్లూరు జిల్లాలో ఉండడం జిల్లా వాసుల అదృష్టమని కొనియాడారు. ప్రశాంతమ్మకు ఆ భగవంతుడి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షి ంచారు.

## గ్రామల పరిశుభ్రతలో నేను సైతం డిగ్రీ కళాశాల యూనిట్




**కలువాయి నవంబర్ 22 ప్రభాతవార్త :** విక్రమ సింహపూరి యూనివర్సటీ వారి ఆద్వర్యంలో శ్రీ శివసాయి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్దులు నూకన పల్లి గ్రామంలో పరిశుభ్రతకు 7 రోజులు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో శనివారం 6 వ రోజు విద్యార్దులు ఉత్సహంగా పాల్గొన్నారు .కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రత, విద్యా ఆరోగ్యం గురించి అవగాహన కలగ చేస్తు ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ఆరోగ్య సిబ్బందితో సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. వీటితోపాటు గ్రామంలో పలు చోట్ల శుభ్రపరచడం తదితర కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వాలింటర్ల సహాయంతో గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు.ఈకార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.నరేంద్రకుమార్,ఎన్ఎస్ఎస్ పిఒ డి జనార్దన్,పంచాయతీ సర్పంచ్ ఎస్ .మౌనిక సెక్రటరీ సిహెచ్ జనార్దన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఏఎస్‌పేట జడ్పీ హైస్కూల్లో గ్రంథాలయ వారోత్సవాలు

**అనుమసముద్రంపేట ,నవంబరు22ప్రభాతవార్త:** ఏఎస్‌పేట శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సమావేశాన్ని స్థానిక జడ్పీ హైస్కూల్లో శనివారం నిర్వహించారు. ఈ వారోత్సవాల సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులకు దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు వి.రుక్మిణి బహుమతులను అందజేశారు. చిత్రలేఖనం సీనియర్ విభాగంలో ప్రథమ బహుమతిని ఐ.సంజన, జూనియర్ విభాగంలో ప్రథమ బహుమతి జె.వర్షిణి, దేశభక్తి గీతాల్లో ప్రథమ బహుమతి పి.హబీబున్నీసా గెలుపొందారు. అనంతరం లైబ్రేరియన్ శ్రీనివాసరాజు మాట్లాడుతూ గ్రంథాలయంలో అన్ని రకాల పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ తోపాటు విజ్ఞానదాయక వనోదాత్మక , నైతిక విలువలు పెంపొందించే బాలసాహిత్యం జీవిత చరిత్రలతోపాటు విన, వార , పక్ష,మాస పత్రికలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతి విద్యార్థి సభ్యత్వాన్ని పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమం విజయవంతానికి సహకరించిన ప్రధానోపాధ్యాయురాలిని శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో హైస్కూల్ లేబ్రేరియన్ కె.ప్రసన్న , ఆంగ్ల ఉపాధ్యాయుడు డి.ప్రసాద్,బిడిసి నిర్వాహకులు ఇ.వి.చలపతిరావు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.



## జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖచే మహిళలకు పోష్ యాక్ట్ పై లీగల్ అవేర్నెస్

**నెల్లూరు సిటీ, నవంబర్ 22, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ సాధికారత ప్రాజెక్ట్ డైరెక్టర్ హేనసుజెన్ ఆదేశాల మేరకు శనివారం నెల్లూరు జిల్లా కుక్కలగుంట 47 వార్డు సచివాలయం నందు మహిళలకు పోష్ యాక్ట్ గురించి లీగల్ అవేర్నెస్ కల్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు వారికీ ఉన్న చట్టాలు గురించి తెలుపుతూ డివి యాక్ట్ 2005, ఫోక్సా యాక్ట్ 2012,ఐటి పిఏ యాక్ట్ 1956 విమెన్ సేఫ్టీ లెజిస్టేషన్ గురించి అవగాహన కల్పించారు. అలాగే పోష్ యాక్ట్ 2013, ఐసీసీ (ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ) షీ బాక్స్, హెల్ప్ లైన్ నెంబర్ 181,112,1930,1098 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పొట్లూరి రామకృష్ణ, సఖి వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ ఎస్కే షహనాజ్, లీగల్ కౌన్సిలర్ ఎన్. ప్రశాంతి, మహిళా పోలీస్ వరలక్ష్మి, ఏఎన్ఎం, వి ఆర్ఓ, సచివాలయం అడ్మిన్‌లు తదితరులు పాల్గొన్నారు.



## నేడు శంకరన్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతి వేడుకలు

**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త :** భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతి వేడుకలను ఈ ఆదివారం (23.11.2025) ఉదయం 10 గంటలకు స్థానిక కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వారి సిబ్బంది, సత్యసాయి వాలంటీర్లు, సేవకులు, భక్తులు, తదితరులు తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర ప్రభుత్వం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా 100వ జయంతి వేడుకలను రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ఆదేశించిందన్నారు.

## శబరిమల వెళుతున్న అయ్యప్ప భక్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సూచనలు : డాక్టర్ కిరణ్ రిషిత

**పొదలకూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** పొదల కూరు శివాలయం నుండి వెళుతున్న అయ్యప్ప భక్తులు అందరూ కూడాను పంబానదిలో స్నానమా చరించేటప్పుడు ముక్కులోకి నోట్లోకి చెవులలోకి నీరు పోకుండా తగు జాగ్రత్తలు తీసుకో వల సినదిగా వైద్యాధికారి డాక్టర్ కిరణ్ వర్షిత సూచిం చారు. పంబానదిలో ఈ కోలై అనే బ్యాక్టీరి యా ఉండడం వలన ఆ అమీబా బ్యాక్టీరియా మా నవ శరీరం లోనికి వెళ్లి హాని చేస్తుందని తద్వారా మనిషి ప్రాణానికే ప్రమాదకరంగా మారుతుందని కనుక భక్తులందరూ తగు జాగ్రత్తలు తీసుకోవల్సిందిగా తెలియజేసారు. ఎవరికైనా జ్వరం, జలుబు, దగ్గు వాంతులు, విరోచనాలు ఇలాంటివి అయిన వెంటనే వైద్యాధికారులకు తెలియజేసి వారి సూచనలు మేరకు చికిత్స పొందవల్సిందిగా తెలిపారు. అందరు కూడాను జాగ్రత్తగా ఉండాల్సినదిగా మరి మరి తెలియ జేసారు. ఈ కార్యక్రమంలో వైద్యధికారి డాక్టర్ కిరణ్ రిషిత ఆరోగ్య సహాయకులు యం. రాధా కుమారి, యం. వెంకటేశ్వర్లు, సచివాలయం శివరూపిణి, ఆశా కార్యకర్తలు సీత, లత పాల్గొన్నారు.



## కోడూరు పీహెచ్‌సీ శుభ్రత సేవలు శ్లాఘనీయం

**తోటపల్లి గూడూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం కోడూరు బాలికల గురుకుల కళాశాలలో విస్తృత స్థాయిలో శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. దోమల నియంత్రణలో భాగంగా కళాశాల బాలికల గదులు, కిటికీలు, పరిసర ప్రాంతాల్లో హెల్త్ ఇన్స్పెక్టర్ బెంజిమెన్ వ్యక్తిగతంగా మలాథిన్ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా కోడూరు పీహెచ్‌సీ వైద్యులు మాట్లాడుతూ వైద్యాధికారి హెనాగ్రేస్ ఆదేశాల మేరకు బాలికల ఆరోగ్యం, భద్రత దృష్టిలో ఉంచుకుని దోమలు, క్రిమి-కీటకాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. ప్రజా ఆరోగ్యాన్ని కాపాడే దిశగా ఈ కార్యక్రమాలు పీహెచ్‌సీ సిబ్బంది నిరంతరం కొనసాగిస్తున్నట్లు చెప్పారు. పరిశుభ్రతలో ఎల్లప్పుడూ ముందుండే కోడూరు పీహెచ్‌సీ సిబ్బంది సేవలు గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్నాయి. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది మల్లేశ్వరి కూడా పాల్గొన్నారు.



## ఇస్కపాలెం పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

**తోటపల్లి గూడూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** మండలంలోని ఇస్కపాలెం గ్రామంలో ధర్మ సింధు సేవా సమితి వారి ఆధ్వర్యంలో మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు తదితర విద్యా సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సమితి ప్రతీ ఏటా చేపట్టే సేవా కార్యక్ర మాల్లో భాగంగానే ఈ పంపిణీని నిర్వహి ంచినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ-2 జయరామ్ నాయుడు పాల్గొని సేవా సమితి చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అభినందించారు. విద్యార్థుల భవిష్యత్ ప్రగతికి ఇలాంటి ప్రోత్సాహాలు ఎంతో దోహదం చేస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమానికి సేవా సమితి సభ్యులు శ్రీనివాసులు హాజరై విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల అవస రాలను గుర్తించి సహాయహస్తం చాచిన సేవా సమితికి ధన్యవాదాలుతెలిపారు.విద్యార్థులు అందించిన విద్యా సామగ్రిని ఎంతో ఆనందంగా స్వీకరించారు. గ్రామంలో విద్య ప్రోత్సాహానికి సేవా సమితి ముందుకు రావడం స్థానికులు ప్రశంసిస్తున్నారు.



## ఉపాధి హామీ కార్యాచరణపై గ్రామ సభ - పారదర్శకతకు ప్రాధాన్యం

**తోటపల్లి గూడూరు, నవంబర్ 22, ప్రభాత వార్త:** మండలంలోని పేడూరు పంచాయతీ పరిధిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఉపాధి హామీ కార్యాచరణ ప్రణాళికపై శనివారం గ్రామ సభను సచివాలయ ఆవరణలో నిర్వహిం చారు. ఉపాధి హామీ పనుల అమలులో పారదర్శకత, బాధ్యతను పెంచడం ఈ సభ ప్రధాన ఉద్దే శం. గ్రామసభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీవో కే. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవినీతి, అక్రమాలు చోటుచేసుకోకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది" అని తెలి పారు. ఉపాధి హామీ జాబ్ కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి అని స్పష్టం చేస్తూ, చనిపోయిన కార్డులను ఇప్పటికే సిస్టమ్ నుంచి తొలగించినట్లు తెలిపారు. అవసరమైన ప్రతీ కుటుంబానికి ఉపాధి లభించాలని ప్రభుత్వ సంకల్పం ఉందని పేర్కొన్న ఆయన, 2026-27 సంవత్సరానికి పనుల గుర్తింపు, ఆమోద వివరాలను గ్రామసభలో ప్రజలకు వివరించారు. ఎవరైనా ఉపాధి హామీ పనులు కోరుకునేవారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదిస్తే వెంటనే పని కల్పిస్తాం. దరఖాస్తు చేసిన వెంటనే జాబ్ కార్డు అందజేస్తాం" అని ఎంపీడీవో తెలియజేశారు. గ్రామస్తులు, ఉపాధి హామీ పనులకు వెళ్లేవారు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలు, సూచనలు గ్రామసభలో వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం వలన గ్రామీణ కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు గ్రామాభివృద్ధి పనులకు ఊతం లభిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈ గ్రామసభలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ ప్రతినిధులు పాల్గొన్నారు.



## దగదర్తిలో పందుల స్వైరవిహారం



**దగదర్తి, నవంబర్ 22, ప్రభాతవార్త :** దగదర్తి గ్రామంలో పందులు విపరీతంగా సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. గ్రామాలు బయట ఉంచాల్సిన పందులను వేరే గ్రామాల నుంచి తీసుకొచ్చి దగదర్తి గ్రామంలో వదలేశారు. ఈ పందులు గ్రామంలో విపరీతంగా తిరుగుతున్నాయి. ఇళ్లల్లోకి పోయి ప్రజలను ఇబ్బంది పెడుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కురిసిన వర్షాల వల్ల నీరు నిలబడిన చోట పందులు విపరీతంగా బుందలో ఉంటూ గ్రామమంతా సంచరిస్తున్నాయి. దీనికి తోడు దోమలు విపరీతంగా ఉండడంతో వీటి వల్ల రోగాల భారిన పడాల్సి వస్తుందని దగదర్తి గ్రామ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇది గమనించి పందులను గ్రామంలో లేకుండా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## దాసరపల్లి పాఠశాలను తనిఖీ చేసిన డిప్యూటీ డీఈఓ

**ఉదయగిరి, నవంబర్ 22, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని దాసరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆత్మకూరు డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి జానకిరామ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాసరపల్లి పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డివిజనల్ ఉప విద్యాశాఖాధికారి అన్ని తరగతుల విద్యార్థుల సామర్ధ్యాలను పరిశీలించి ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థుల అభ్యసన, పఠన సమాచారం పరిశీలిస్తూ పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ద వహిస్తూ ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకోవాలని తెలియజేశారు. విద్యార్థులకు 100 రోజుల ప్రణాళికను సమర్ధవంతంగా అమలు చేయాలని డిసెంబర్ 5వ తేదీ లోపల 100 రోజుల ప్రణాళికను పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సంసిద్దులను చేయాలని తెలియజేశారు. మార్చి 16 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని ఈ పరీక్షలలో విద్యార్థులు నూటికి నూరుశాతం అత్యుత్తమ ఫలితాలతో విజయం సాధించే విధంగా ప్రణాళిక బద్దంగా బోధించి వారిని పరీక్షలకు తయారు చేయాలని ప్రధానోపాధ్యాయులు మొగల్ ఖాదర్‌భాషాకు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు తెలియజేశారు.



## ఉపాధి హామీ కార్యచరణపై గ్రామ సభ

**వింజమూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** వింజమూరు మేజర్ పంచాయతీ పరిధిలో 2026-27 సంవత్సరానికి ఉపాధి హామీ కార్య చరణ ప్రణాళికపై గ్రామసభ నిర్వహి ంచారు. శనివారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా ఎంపీడీవో కే.శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ జాబ్ కార్డులకు ఈకేవైసీ తప్పనిసరి అని తెలిపారు. పంచాయతీ పరిధిలో సుమారు 5000 జాబ్ కార్డులు ఉన్నాయని, ప్రస్తుతం 3200 పై చిలుకు జాబ్ కార్డులు ఈ కేవైసీ చేయడం జరిగిందన్నారు. 1000 నుండి 1100 జాబ్ కార్డులు డిలీట్ చేయడం జరిగిందన్నారు. మిగిలిన జాబ్ కార్డుదారులు కూడా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టిందని తెలిపారు. పని చేసే వారికే పని కల్పించాలని సంకల్పంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే 2026-27 ఆర్థిక సంవత్సరానికి పనుల గుర్తింపు ఆమోదం వివరాలను గ్రామసభలో తెలియజేశారు. పంచాయతీ పరిధిలో ఎవరైనా ఉపాధి హామీ పనులు కావాలన్న వారు పంచాయతీ కార్యాలయంలో సంప్రదిస్తే పని కల్పించడం జరుగుతుందన్నారు. పనికి వెళ్లే వారికి దరఖాస్తు చేసుకున్న వెంటనే జాబ్ కార్డు కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.సుజనా, డిప్యూటీ ఎంపీడీవో కే.రామారావు, మండల తెలుగుదేశం కన్వీనర్ గూడా నర్సా రెడ్డి, సుశీల, ఉప సర్పంచ్ జి.సుశీల, క్షేత్ర సహాయకులు బి.రమణయ్య, ఎస్.శ్రీనివాసులు, కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.



## ఈ అభ్యాస్ రాష్ట్ర స్థాయిలో జెమ్స్ విద్యార్థుల ప్రతిభ

**రాపూరు, నవంబరు22ప్రభాతవార్త :** ఈ అభ్యాస్ ప్రీ ఐఐటి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చాణక్య బిజినెస్ అప్టిట్యూడ్ ఆర్యభట్ట మెంటల్ ఎబిలిటీ టెస్ట్ ఒలంపియాడ్ పరిక్షలలో రాపూరులోని జెమ్స్ ఇంగ్లీషు మీడియం విద్యార్థులు అధ్బుత ప్రతిభ కనపరిచి రాష్ట స్థాయిలో ప్రధమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి తెలిపారు. సి. బ్యాట్‌లో ఎస్. జ్యోషిత, యం. కీర్తన, సిహెచ్. సుమీట్, డి. జ్ఞానితలు విజయం సాధించారు. ఎ.మ్యాట్‌లో ఎస్.కె ఆలియా, సిహెచ్. జ్యోష్న, యం. వెంకట జయదేవ్, టి. సాత్విక్, పి. పర్ణితలు విజయం సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ బులగాకుల మునీంద్రా రెడ్డి, ఛైర్మన్ కేతా జనార్ధన్ రెడ్డి, డైరెక్టర్ స్వాతి, ఐఐటి ఒలంపియాడ్ కోఆర్డినేటర్ వెంకట రత్నం, వినాయక కాలేజ్ ప్రిన్స్‌పాల్ పవన్, జెమ్స్ అధ్యాపకులు రాజా ,అరుణాలు ప్రత్యేకంగా అభినందించారు.



## ఎంకేఆర్ హైస్కూల్‌కు ఆర్వో ప్లాంట్ వితరణ: పముజుల

**ఇందుకూరుపేట, నవంబర్ 22, ప్రభాత వార్త :** ఇందుకూరుపేట మండల ంలోని కొత్తూరు ఎంపీఆర్ హైస్కూల్లో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన సందర్భ ంగా దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి ఆదర్శ ంగా తీసుకొని ఈ కార్యక్రమాలు ముం దుకి సాగిస్తున్నారు. పముజుల రవి తన సొంత నిధులతో శనివారం ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల టీడీపీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ రెడ్డి పాల్గొని ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు నియోజ కవర్గంలోని పదవ తరగతి విద్యార్థులకు దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పరీక్ష ఫీజు చెల్లించడమైందని తెలిపారు. పముజుల రవి పిల్లల దాహార్తీ తీర్చడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న సర్వేపల్లి శాసనసభ్యులు

**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త -వైద్యం :** పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి. ఒకప్పుడు సోమిరెడ్డి కుటుంబానికి చెందిన శ్రీనివాస మహల్ స్థలాన్ని కొనుగోలు చేసి అపార్టుమెంట్ నిర్మించిన జైనులు. జైన్ పెద్దల ఆహ్వానం మేరకు అపార్టుమెంట్ ప్రాంగణంలో నిర్మించిన జైన్ మందిర ప్రారంభోత్సవంలో పాల్గొన్న సోమిరెడ్డి సోదరులు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం చేసిన జైనులు. శ్రీనివాసమహల్‌తో తమ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకోవడంతో పాటు పాతస్మృతులను అందరితో పంచుకున్న సోమిరెడ్డి.



## ఘనంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు



**ఇందుకూరుపేట, నవంబర్ 22, ప్రభాతవార్త** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా ఇందుకూరుపేట మండలంలోని మైపాడు సముద్ర తీరంలో మైపాడు యువ నాయకులు దువ్వూరు కళ్యాణ్ కుమార్‌రెడ్డి సహకారంతో మత్స్యకారులు ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకను మైపాడు సముద్ర తీరంలో ఘనంగా నిర్వహించారు. రాత్రి 12గంటలకు మైపాడు సముద్ర తీరంలో పడవల్లో అధిక సంఖ్యలో బాణసంచాలు పేలుస్తూ భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిదిగా జడ్పీ వైస్ చైర్మన్ శ్రీహరి కోట జయలక్ష్మీ పాల్గొని కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టారు. అనం తరం మత్స్యకార నాయకులు పామంజి నరసింహ మాట్లాడుతూ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఆమెకి ఎల్లప్పుడూ ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం మాజీ జడ్పీటీసీ శ్రీహరికోట ప్రసాద్ మాట్లాడుతూ మంచి కారు దినోత్సవం మరుసటి రోజున కోవూరు ప్రజల దైవం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పుట్టిన రోజు జరుపుకోవడం మత్స్యకారులుగా ఎంతో గర్వపడుతున్నామన్నారు. వేమిరెడ్డి కోవూరు నియో జకవర్గానికి ఎన్నో సేవలు చేస్తున్నారని కొనియాడారు. ఆమె ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంటూ ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేంద్ర, గంపల సుబ్రహ్మణ్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరువురుకి డిప్యూటి ఎంపిడిఒలుగా పదోన్నతి

**మనుబోలు నవంబర్ 22 ప్రభాతవార్త :** మనుబోలు మండల పరిషత్ లో పనిచేస్తున్న ఇద్దరు అధికారులకు డిప్యూటి ఎంపిడిఒలుగా పదోన్నతి ని కల్పిస్తు ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వలు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. మనుబోలు పంచాయితీ కార్యదర్శిగా పనిచేస్తున్న గరుడయ్య, ఎంపిడిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నిరంజన్‌కుమార్‌లకు డిప్యూటి ఎంపిడిఒలుగా పదోన్నతి కల్పించారు. వీరిని ఎంపిడిఒ జలజాక్షి, ఏవో ముజిబున్నీసా, డిప్యూటి ఎంపిడిఒ శ్రీనివాసరావు,ఏపివో రాజమ్మ, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌లు అభినందించారు.



## అభివృద్ధి వేగం.. సీసీ రోడ్డు, డ్రైన్ శంకుస్థాపన

**నెల్లూరు రూరల్, నవంబర్ 22, ప్రభాతవార్త** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 18వ డివిజన్, హరనాథపురం కేవీఆర్ డొంక ప్రాంతంలో 14.25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు నేడు టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం హరనా థపురం ఎక్స్టెన్షన్‌లోని పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్ప డిన తర్వాత ఇప్పటి వరకు 18వ డివిజన్ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించినట్లు గిరిధర్‌రెడ్డి వెల్లడించారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో చంద్రన్న పార్కుల బాట కార్యక్రమం కొనసాగుతోందని చెప్పారు. నియోజకవర్గంలోని 26 డివిజన్‌లలో 18 ఎకరాల్లో ఉన్న పార్కుల ప్రభుత్వ భూమి కబ్జా దారుల నుండి రక్షించేందుకు రూ.7 కోట్ల వ్యయంతో ప్రహరిగోడలు నిర్మించినట్లు తెలిపారు. ఇవి సుమారు రూ.400 కోట్ల విలువ గల భూములని పేర్కొన్నారు. అంతే కాకుండా, పార్కుల పురోభివృద్దిలో భాగంగా 26 డివిజన్‌లలో 35 లక్షల రూపాయలతో 2370 మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే 1900 మొక్కలు నాటినట్లు తెలిపారు. మొక్కల సంరక్షణలో స్థానిక ప్రజలతో పాటు వాకర్స్ అసోసియేషన్, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ కీలక పాత్ర పోషించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఎన్నడూ లేనంతగా అభివృద్ధి కొనసాగుతుందని గిరిధర్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి ప్రజల ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌చార్జి చాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, కో క్లస్టర్ ఇన్‌చార్జి ఖాదర్ భాషా, 18వ డివిజన్ టీడీపీ అధ్యక్షులు పెనాక శ్రీనివాసులురెడ్డి, తదితర టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అనుమానస్పందంగా వ్యక్తి మృతదేహం లభ్యం

**ఉదయగిరి, నవంబర్ 22, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరి పట్టణంలోని స్టేట్ పేటలో గల ఏబీఎం కాంపౌండ్ ఆవరణంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి అనుమాన స్పందంగా మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎస్సై ఇంద్రసేనారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి వయసు సుమారు 60 ఏళ్లు ఉన్నట్లు సమాచారం. ఈ వ్యక్తి గడ్డి మందు సేవించి ఆత్మహ్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా తెలుస్తుంది. అతను చనిపోయిన దగ్గర గడ్డి మందు బాటిల్ కూల్ డ్రింక్స్ బాటిళ్లు ఉన్నాయి. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఉదయగిరిలో మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం ఈయన దగదర్తి మండలం చవటపుట్టేడు గ్రామానికి చెందిన పులి యర్రయ్య ఈయన వయసు 75 సంవత్సరాలుగా కుటుంబ సభ్యులు నిర్ధారించారు.



## ప్రతి ఒక్కరూ సామాజిక సేవా స్ఫూర్తి కలిగి ఉండాలి

**కోవూరు,నవంబం22 ప్రభాతవార్త :** కళాశాలలో చదివే ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయా లనే స్ఫూర్తి కలిగి ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన అన్నారు. కోవూరు మండలం పోతిరెడ్డిపాలెం గ్రామంలో శనివారం వైకేఆర్‌అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగాఆమె మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు పరిసరాల పరిశు భ్రత, వ్యక్తిగత పరిశుభ్రత తదితర అంశాలపై వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్. వాణి మాట్లాడుతూ ఈ ఎన్ఎస్ఎస్ క్యాంపును తమ గ్రామంలో నిర్వహించేలా కళాశాల చొరవ తీసుకోవడం పట్ల వారికి ప్రత్యేక అభినందనలు తెలియ జేస్తున్నా మన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రామాంజనేయులు,అధ్యాపకులు మధుసూదన్‌రావు, ప్రధానోపాధ్యాయులు ఏ. మురళీధర్‌లు పలు సూచ నలు చేశారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.




## ఇల్లు కూల్చేచారు..విచారించి న్యాయం చేయండి



**రాపూరు,నవంబరు22ప్రభాతవార్త** తన ఇంటిని అక్రమంగా తన ఇంటిని అక్రమంగా కూల్చివేశారని తనకు న్యాయం చేయాలని రాపూరు పంచాయితీ పరిధిలోని మల్లమ్మగుంటకు చెందిన మల్లికా వెంకటేశ్వర్లు, వారి కుమారుడు మల్లికా వరప్రసాద్‌లు శనివారం రాపూరు తహశిల్దార్ లక్ష్మీనరసింహకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14వ తేది తిరుమలలో ఉద్యోగాలు చేస్తున్న తన అన్న కుమారులు తన ఇంటిలోని సామను బయట వేసి దౌర్జన్యంగా ఇంటి రేకులు పగుల కొట్టి, జెసిబితో ఇంటిని పడగొట్టారన్నారు. దీంతో తాను 17వ తేది నెల్లూరులో జిల్లా ఎస్పీకి స్పందనలో ఫిర్యదు చేశానన్నారు. దీంతో తాము సిఐ ద్వారా ఎస్ఐని కలవగా వారు కేసు విచారణలో వుంది. తాము తహశిల్దార్ గారికి విషయం తేలిపి ఆయన ఆదేశాల మేరకు కేసు కడుతామని చేప్పారన్నారు. తనకు ఈ ఇంటి స్థలానికి చెందిన ఇంటి పన్ను ,రేషన్ కార్డు, అన్ని ఆదారాలు వున్నాయాని తన ఇంటిని అక్రమంగా కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోని తమకు న్యాయం చేయాలని ఆ వినతి పత్రంలో వారు కోరారు.

## ఘనంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు



**ఇందుకూరుపేట, నవంబర్ 22, ప్రభాతవార్త :** ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం గ్రామంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు చాముండేశ్వరి దేవస్థానం చైర్మన్ గుండాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడూరు కమలాకర్‌రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి, ప్రజా సేవలో వీపీఆర్ దంపతులు చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఏకోళ్ల పవన్‌రెడ్డి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంటరీ కార్యవర్గ కార్యదర్శి పొన్నబోయిన చెంచు కిషోర్‌బాబు, కొండూరు సుధాకర్‌రెడ్డి, కొండూరు వెంకట రమణారెడ్డి, మండల బీసీ సెల్ అధ్యక్షులు మారుబోయిన జనార్ధన్ గౌడ్, దుగ్గా శంకర్‌రెడ్డి, గుండాల మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి బర్తడేకి వెయ్యిమందికి దుప్పట్లు పంపిణీ వంద కేజిలు కేకు కటింగ్




**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా తేజాడవపర్స్ అధినేత శ్రీనివాసులురెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు చింతంరెడ్డి శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో వెయ్యిమందికి దుప్పట్లు పంపిణీ చేశారు. వంద కేజిల కేకు కట్ చేశారు. పెద్దఎత్తున అన్న దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా బుచ్చి రూరల్ బ్యాంకు చైర్మన్ ఏటూరు శివరామకృష్ణారెడ్డి, బుచ్చి టిడిపి నగర్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, సీనియర్ నాయకులు ఎం.విశేషయ్య, దుగ్గిశెట్టి హరినాథ్ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధులుగా విచ్చేసిన వారికి శాలువాలు కప్పి సన్మానం చేశారు. ముఖ్య అతిధులు మాట్లాడుతు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి జన్మదినం సందర్భంగా తేజా డెవలపర్స్, చింతంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఇంత పెద్దఎత్తున కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ప్రశంసించారు. పలువురు టిడిపినాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు 150 మంది రక్తదానం





**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెం టిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలను నగర్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెడ్ క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించగా 150 మంది రక్తదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోడూరు కమలాకర్‌రెడ్డి వ్యవహరించారు. పెద్దఎత్తున కేకును కట్ చేశారు. నాయకులు,కార్యకర్తలు ఒకరికి ఒకరు కేకు తినిపించుకొని ఎమ్మెల్యేకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులు మాట్లాడుతు కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని స్పూర్తిగా తీసుకోవాలని అన్నారు. సేవాభావం, అధ్యాత్మికత, ప్రజలకు మంచి చేయాలన్న తపన వున్న శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎం.వి శేషయ్య, సీనియర్ నాయకులు నెల్లూరు ప్రభాకర్‌రెడ్డి, జొన్నవాడ దేవస్దానం మాజీ చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు,కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ, వింజం రామానాయుడు, కౌన్సిలర్ అందె ప్రత్యూషా,రంజిత్, దశరద్, వల్లూరు శ్రీనివాసులు,చెంబేటి ప్రసాద్, గుబ్బా సురేష్, దొడ్ల కోదండరా మిరెడ్డి, వల్లూరు రాఘవరెడ్డి,రాష్ట్ర చేనేత శాఖ డైరెక్టర్ తాళ్ళ నరసింహస్వామి, దుగ్గిశెట్టి హరినాద్, రైతు విభాగం అధ్యక్షులు పెనాక అమర్‌నాద్‌రెడ్డి, మినగల్లు నాయకులు బొర్రరాము, మైనార్టీనాయకులు సుభాన్, బిజెపి నాయకులు కాసా శ్రీనివాసులు, జనసేన అధ్యక్షులు మాదవ్, హాస్పటల్ డైరెక్టర్ కె.ప్రసాద్, మైనార్టీనాయకులు షబ్బీర్,షేక్ ఫర్వీనా, యూత్‌నాయకులు, వింజం మహేష్‌నాయుడు, కిషోర్, రేబాల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, పలువురు టిడిపిటిడిపినాయకులు తదితరులున్నారు.

## మొక్కలు నాటిని వైస్ చైర్మన్లు

**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం 6,8,9,11 వార్డులలో కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినం పుర స్కరించుకొని వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి,వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, మైనార్టీనాయకులు పఠాన్ మహబూబాషా, కౌన్సిలర్ రహమత్, కౌన్సిలర్ రాచూరు సత్యనారాయణ, మైనార్టీనాయకుల దస్తగిరి చెట్లు నాటి, బదరీల పాఠశాలలో చిన్నారులకు విందు బోజనం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు టిడిపినాయకులు తదితరులున్నారు.



## ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకొని మినగల్లు లో చెట్లు నాటిని టిడిపినాయకులు

**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పాత మినగల్లు గ్రామంలో సదరన్ చా నల్ పక్కన కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి జన్మదినం పురస్కరించుకొని టిడిపి నాయకులు బొర్రరాము, సర్పంచ్ పూజితా నేతృత్వంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి వారు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సిసి కెమెరాను కూడా ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో పలువురు టిడిపినాయకులు పాల్గొన్నారు.



## రక్తదానశిబిరాన్ని నిర్వహించిన రావూస్ ఎన్‌సిసి విద్యార్థులు




**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త-విద్య :** 77వ ఎన్‌సిసి డే వేడుకలను పురస్కరించుకుని శనివారం నగరంలోని స్థానిక రావూస్ ఎన్‌సిసి విద్యార్థులు 2(ఎ)ఈఎంఈ యూనిట్ ఎన్‌సిసి కార్యాయంలో రక్తదానశిబిరాన్ని చేపట్టారు. విద్యార్థులతోపాటూ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ బి.పెంచలప్రసాద్ రక్తదానం చేసి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తమ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి కల్నల్ అరుణ్ కుమార్ ఆదేశాల మేరకు ఈ రక్తదాన శిబిరం నిర్వహించటం జరిగిందన్నారు. సుమారు 40మందికి పైగా విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేయటం జరి గిందని, అందరూ విధిగా రక్తదానం చేయ్యాలని కోరారు. ఎన్‌సిసి సిబ్బంది సుబేదార్ మురళీమోహన్, రజత్‌సేన్‌గుప్తా, వేద ప్రకాష్, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ అనిత, టెక్నీషియన్స్ ప్రవీణ్, పాల్గొన్నారు.

## రక్తదానం చేయడం అనేది మరొకరికి ప్రాణదానంతో సమానం





**కోవూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కోవూరు తెలుగు యువత పట్టణ టీడీపీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ శిబిరాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు కోడూరు కమలాకర్‌రెడ్డి పరిశీలించారు. మాట్లాడుతూ కోవూరు ఎమ్మెల్యే జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా సామాజిక సేవా కార్యక్ర మాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, ఉచిత కంటి పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం ఇతరులకు స్ఫూర్తిదాయమని, దీనిని నిరంతరం కొనసాగించాలని ఈ సందర్భంగా ఆయన యువతకు సూచించారు. తెలుగు యువత నేత సాయిరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో కోవూరు ఎమ్మెల్యే మరింత ఉన్నత పదవులు పొందాలని ఆ భగవంతున్ని కోరుతున్నామన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, తదితరులు ప్రసంగించారు.

**– రక్తదాన శిబిరం విజయవంతం** స్థానిక పీవీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 162 మంది యువత రక్తదానం చేశారు. అదేవిధంగా జయభారత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో 120 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అదేవిధంగా క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌కు 150 మంది మహిళలు హాజరుకావడం జరిగింది. మొత్తం ఈ వైద్య శిబిరంలో 400 మంది హాజరయ్యి వివిధ రకాల పరీక్షలు నిర్వహించుకుని మందులు అందుకున్నారు.

## ఎమ్మెల్యే స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు





**కోవూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె ఇచ్చిన స్ఫూర్తితోనే శనివారం సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని మండల పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఇనమడుగులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సహకారంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇచ్చిన సూచనల మేరకు స్థానిక ఇనమడుగు ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. కోవూరు నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు కూడా వేమిరెడ్డి దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్ఫూర్తిని పొంది కోడూరు కమలాకర్ ఆధ్వర్యంలో నాయకులంతా 2.98 లక్షలు నిధులను అందజేయడం జరిగిందన్నారు. అంతకుముందు భారీ స్థాయిలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జొన్నవాడ దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, సభ్యులు గునుపాటి ప్రసాద్‌రెడ్డి, ఎలమూరి రంగయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు సునీల్‌రెడ్డి, నాగరాజు, నేతలు బాల రవి, నాటకరాణి వెంకట్, నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ పెంచలయ్య, చింతలపూడి పెంచలయ్య, పురుషోత్తం, గుత్తికొండ వెంకయ్య, బద్దిపూడి శ్రీనివాసులు, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

## ఎంపీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



**కోవూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్ తెప్పించి కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న రోజుల్లో కోవూరు ఎమ్మెల్యే మరింత ఉన్నత పదవులు పొందాలని ఆ భగవంతుడిని కోరుతున్నామన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, కార్యా లయ పర్యవేక్షకులు ఉషారాణి, సీనియర్ అసిస్టెంట్ సురేష్, జూనియర్ అసిస్టెంట్ రాధ, పీ-4 ఉద్యో గులు, ఆఫీస్ సబార్డినేట్లు పాల్గొన్నారు.

## ఆర్భాటాలకు దూరంగా .. సేవా నిరతికి దగ్గరగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు





**కోవూరు, నవంబర్ 22, ప్రభాతవార్త :** కోవూరు శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఆర్భాటాలకు దూరంగా ఆప్యాయత, అనురాగాల మధ్య ఘనంగా నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బంది అందరికీ వస్త్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన పుట్టిన రోజు సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చేయడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. అంతకుముందు నందమూరి తారకరామారావు, బసవతారకం దంపతుల విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. హాస్పిటల్‌లో పర్యటించి అందుతున్న సేవలను తెలుసుకున్నారు. సినీ నటులు బాలకృష్ణ ఎంతో ఉన్నతాశయంతో ఈ ఆస్పత్రిని తీర్చిదిద్దారన్నారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో, షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వాదం తీసుకున్నారు.

## కరాటే ఛాంపియన్‌షిప్‌లో సత్తా చాటిన రత్నం పాఠశాల విద్యార్థి

**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త-విద్య :** ఇటీవల ఆగ్రాలో నిర్వ హించిన ఇండో నేపాల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో నగరంలోని స్థానిక ఏసీ నగర్‌లోని రత్నం హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతు న్న విద్యార్థి వి.తనీష్ పాల్గొని బంగారు పతకాన్ని కైవశం చేసుకుని సత్తాచాటారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక పాఠశాలలో పతకాన్ని సాధించిన విద్యార్థికి అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ కే.వేణుగోపాల్ మాట్లాడుతు విద్యార్థులు చదువుతోపాటూ ఆటలు, పాటలు, తదితర రంగాల్లో కూ డా రాణించాలన్నారు. తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు చదువుతోపాటూ అన్నీ విభాగాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. తమ విద్యార్థి తనీష్ బంగారు పతకం సాధించటమే ఇం దుకు ప్రత్యక్షనిదర్శనమన్నారు. తనీష్ రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన కోరారు. విద్యార్థికి పాఠశాల ప్రిన్సిపాల్ మహబూబ్‌బాష పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



## మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో పోస్టేట్ విస్తరణ(బీపీహెచ్)పై అవగాహన

**- 40ఏళ్లు పైబడిన పురుషులు తప్పనిసరిగా స్కీనింగ్ చేయించుకోవాలి**

**- మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు**




**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త -వైద్యం** పురుషుల్లో ఎక్కువగా కనిపించే ప్రోస్టేట్ హైపర్ ప్లాసిస్ లేదా ప్రోస్టేట్ విస్తరణపై అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు ప్రత్యేక ప్రెస్‌మీట్ నిర్వహించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు ప్రత్యేక ప్రెస్‌మీట్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి డాక్టర్ గోకుల్‌నచికేత్‌జి,కన్సల్టెంట్ యూరాజిస్ట్ ముందడుగు వేశారు. డాక్టర్ గోకుల్ మాట్లాడుతూ పురుషుల్లో 40 సంవత్సరాల, తర్వాత ప్రోస్టేట్ గ్రంధి క్రమంగా పెద్దదవుతూ, మూత్ర విసర్జన సమస్యలు, తరచూ మూత్రం రావడం నిద్రలో ఇబ్బంది(నాక్టూరియా), బలహీనమైన మూత్ర ప్రవాహం వంటి లోపాలు కనపడ తాయని తెలిపారు. చాలామంది ఈ లక్షణాలను సిగ్గు లేదా వయసు కారణంగా సహజమని భావించి వైద్యసలహాను ఆలస్యం చేస్తారని చెప్పారు. లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే మూత్రాశయం అవరోధం, మూత్ర నిల్వ, ఇన్ఫెక్షన్లు, చివరికి మూత్ర పిండాలకు కూడా నష్టం కలగవచ్చని హెచ్చరించారు. ప్రారంభ దశలోనే అల్ట్రాసౌండ్, డిజిటల్ రెక్టల్ ఎగ్జామినేషన్, పీఎస్ఏ పరీక్ష ద్వారా సమస్యను ఖచ్చితంగా గుర్తించవచ్చని తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో అధునాతన యూరాలజీ సేవలు, లేజర్ ప్రోస్టేట్ సర్జరీ వంటి ఆధునిక చికిత్సలు అందుబాటులోఉన్నాయని, ఇవి తక్కువ రక్త స్రావం, వేగవంతమైన రికవరీ వృద్ధులకు సురక్షితమైన మార్గమని చెప్పారు. పురుషులు మూత్ర సంబంధ సమస్యలను వయసు కారణంగా సహజమని భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ ప్రోస్టేట్ విస్తరణ ఒక వైద్య సమస్య, ప్రారంభదశలోనే పరీక్షలు చేయించుకుంటే సులభమైన ఉరక్షితమైన చికిత్సలు అందుబాటులో ఉంటాయి. మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరులో ప్రతిరోగికి నిష్ణాత,ఆధార పడదగిన, కరుణతతోకూడిన సేవలు అందించడం మాలక్ష్యం అని డాక్టర్ గోకుల్ నచికేత్, జి.కన్సల్టెంట్ యూ రాలజిస్ట్,మెడికవర్ హాస్పిటల్స్ ,నెల్లూరు. మెడిక వర్ హాస్పిటల్ సెంటర్ హెడ్ లావణ్య, మెడికవ్ సూపరింటెండెంట్ డాక్టర్ అభిషేక్ పాల్గొన్నారు.

## చైర్ పర్సన్ అరుణమ్మని కలిసిన సీఈవో శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త** నెల్లూరు డీపీఓగా విధులు నిర్వహిస్తూ నూతన జిల్లా ప్రజా పరిషత్ సీఈవోగా నియమతులైన ఎల్. శ్రీధర్ రెడ్డి శనివారం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఆనం అరుణమ్మని మర్యాద పూర్వకంగా కలిశారు.

## జెడ్పీ సీఈఓగా శ్రీధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ



**నెల్లూరు కలెక్టరేట్, నవంబర్ 22, ప్రభాతవార్త** జిల్లా పంచాయతీ అదికారిగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ అధికారి లక్కిరెడ్డి శ్రీ ధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు సీఈవోగా ఉన్న విద్యారమఈ ఏడాది జూన్‌లో బదిలీపై వెళ్లారు. అప్పటినుంచి ఈ పోస్టు ఖాళీగా ఉండగా, డిప్యూటీ సీఈవో మోహన్ రావు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పగించారు. డీపీవోగా పనిచేస్తున్న శ్రీధర్‌రెడ్డిని జెడ్పీసీఈవోగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీధర్ రెడ్డి జెడ్పీ కార్యాల యంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

## సిఐ సతీష్ మృతిపై శాలివాహన సంఘాల ఆగ్రహం

**సిబిఐ చేత విచారణనిర్వహించాలి**



**బుచ్చి నవంబర్ 22 ప్రభాతవార్త** సిఐ సతీష్ మృతిపై సిబిఐ విచారణ జరపాలని శాలివాహన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుచ్చిరెడ్డిపాళెంలో వారు పెద్దఎత్తున క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. సతీష్ మరణం ఆత్మహత్య కాదు.... అనుమానస్పద మృతి అని దీనిపైన పూర్తిస్దాయిలో విచారణ జరపాలని వారు డిమాండ్ చేశారు. సతీష్‌కుమార్ తన విధి నిర్వహణలో నిజాయితీగా వ్యవహరించినందుకు ఇలాంటి మృతి చెందాల్సి వచ్చిందని అన్నారు. సతీష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని వారు పేర్కున్నారు. సతీష్‌కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలి. ఈకార్యక్రమంలో అధ్యక్షులు మాచవరం శ్రీనివాసులు, కార్యనిర్వహణ అధ్యక్షులు వెంకటశేషయ్య, ప్రధాన కార్యదర్శి అల్లూరి శ్రీనివా సు లు, ఉపాధ్యాక్షులు కావలి వెంకటేశ్వర్లు, కోశాధికారి పెట్లూరి క్రిష్ణయ్య, బిసి సంఘం నాయకులు, రామిశెట్టి కళ్యాణ్, సోమా గోపాల్, కాసా శ్రీనివాసులు, నాయి బ్రాహ్మణ జిల్లా అద్యక్షులు, శ్రీకుమార్, పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలు ఆకస్మిక తనిఖీలు



**సైదాపురం, నవంబర్ 22, ప్రభాతవార్త** మండలంలో ఉన్న ఎరువుల దుకాణాలను కోవూరు అగ్రికల్చర్ ఏడీఏ అనిత శనివారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సంద ర్భంగా ఎరువుల దుకాణా లకు సంబంధిం చి లైసెన్స్‌లు,స్టాక్‌వివరాలు, కొనుగోలు, అమ్మకాలకు సంబంధించి పలు రికార్డు లను ఆమెపరిశీలించారు. ఆమెతో పాటు మం డల వ్యవసాయశాఖాధికారిణి హైమావతి ఉన్నారు.

## అయ్యప్పస్వామి గుడిలో అన్న సంతర్పణ చేసిన అమర



**కావలి, నవంబర్ 22, ప్రభాతవార్త:** కావలి కలుగోలమ్మ పేటలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానము నందు ఉభయ దాతలుగా అమరా బ్రదర్స్, వార్డ్ మాజీ కౌన్సిలర్, ఆలయ కమిటీ సభ్యులు అమర వేదగిరి సుబ్బరాయుడు గుప్తా ఆధ్వర్యంలో శనివారం అయ్యప్ప స్వామికి విశేష పూజలు నిర్వహించి అయ్యప్ప స్వామి మాల ధారణ వేసిన స్వాములకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి భారీ స్థాయిలో అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అమర వేదగిరి సుబ్బరా యుడు గుప్త మాట్లాడారు శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానం నందు కార్తీక మాసం ప్రారంభం నుండి నిత్య అన్న సంతర్పణ కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగు తుందని తెలియజేశారు. గత 12 సంవత్స రాలుగా అన్న సంతర్పణ కార్యక్రమాన్ని ఆలయ ధర్మకం ర్తలు, దేవస్థానం కమిటీ సభ్యులు కలిపి ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అన్న సంతర్పణ కార్యక్రమంలో వందలాదిగా అయ్యప్ప మాల ధారణ వేసిన స్వాములు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. దేవస్థాన ధర్మకర్తలు దుగిశెట్టి నవీన్,దుగిశెట్టి మాధవి,ఆలయ కమిటీ సభ్యులు భవనాసి కృష్ణస్వామి,పొన్నూరు వెంకటేశ్వర్లు, సన్నీబోయిన నారాయ ణ,కంచర్ల కళ్యాణ చక్రవర్తి,మరియు ఆర్యవైశ్య సం ఘం అధ్యక్షులు తటవర్తి రమేష్. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు,ఆర్యవైశ్య ప్రముఖులు,మిత్రులు,శ్రేయోభిలాషులు,బంధువులు పాల్గొన్నారు.

## ఘనంగా రావూస్ విద్యార్థుల క్లబ్ ఫెస్ట్-2025



**నెల్లూరు, నవంబర్ 22, ప్రభాతవార్త-విద్య :** శనివారం నగరం లోని స్థానిక రావూస్ డిగ్రీ కళా శాలలో విద్యార్థుల క్లబ్‌ఫెస్ట్- 2025ను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా రావూస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.కోటేశ్వ ర రావు, డైరెక్టర్ వై.శివసంకేత్,సిఈఓ. ఎన్.శివారెడ్డి లు పాల్గొన్నా రు చైర్మన్ కోటేశ్వ రరావు మాట్లాడుతు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతి భను వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు వివిధ అంశాల్లో వారి వారి విజ్ఞానాన్ని ప్రదర్శించటం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యంగా రానున్న రోజుల్లో ఏఐ అన్నీ రంగాల్లో భాగం కానుందని, విద్యార్థులు ఆయా రంగాలపై ఎక్కువగా మక్కువ పెంచుకోవాలని కోరారు. డైరెక్టర్ శివసంకేత్ మాట్లాడుతు విద్యార్థులకు చదువుతోపాటూ అన్నీ రంగాల్లో నైపుణ్యం కూడా అవసరమన్నారు. ఎంతో ఖర్చుకో కూడుకున్నా విద్యార్థుల భవిష్యత్ కోసం ఇటువంటి క్లబ్ ఫెస్ట్‌లను తాము నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఫెస్ట్‌నుతిలకించి విద్యార్థులును అభినందించారు. ప్రిన్సిపాల్ షరీఫ్, డీన్ సుందర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.